కర్నూలు | నంద్యాల
వార్త
22 జూన్ • 2023 గురువారం, పేజీలు 4

# వీర్య ఆబోతు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

: బనవాసి నర్సరీ మరింతగా అభివృద్ధి చేస్తాం..కలెక్టర్ సృజన





2లో

ఎమ్మిగనూరు క్రైం, జూన్ 21 ప్రభాతవార్త: బనవాసి నర్సరీని మరింతగా అభివృద్ధి చేస్తామని జిల్లా కలెక్టర్ డా.జి.సృజన పేర్కొన్నారు. బుధవారం ఎమ్మిగనూరు మండల కేంద్రంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను, బనవాసి సెంట్రల్ నర్సరీనీ, పశుసంవర్ధక పాలిటెక్నిక్ కళాశాలను, ఘనీకృత వీర్య ఆబోతు కేంద్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ ఉపాధి హామీ పనులను పరిశీలిస్తూ అక్కడ ఉన్న ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతూ మీరు రోజు ఏ సమయానికి వస్తున్నారు, మీకు తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్నారా లేదా అని కూలీలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు ఉదయం 6 గంటలకు పనులకు వస్తున్నామని, పనులు చేస్తున్న సమంలో..

# చింతకుంట.. నీటిచింత..!





- చింతకుంట రిజర్వాయర్‌లో ఇంకిపోయిన నీరు
- దాదాపు 22గ్రామాలకు తాగునీటి సరఫరా బంద్
- తాగునీటి కోసం అవస్థలు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

**గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి రిజర్వాయర్లు, చెరువులు,ఫిల్టర్ బెడ్‌లు నిర్మిస్తున్నామని చెబుతుంది. అయితే కోట్లు ఖర్చుచేస్తున్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తీరడం లేదు. మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో నిర్మించిన రిజర్వాయర్‌లో నీరు ఇంకిపోవడంతో దాదాపు 22గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. అధికారులు మాత్రం స్పందించడం లేదు.**

హాలహర్వి,జూన్ 21,ప్రభాతవార్త : వివరాల్లోకి వెళితే హాలహర్వి మండలం లోని చింతకుంట గ్రామంలో ఎల్ఎల్‌సి కాలువ పక్కన తాగునీటి సమస్య పరిష్కారం కోసం గత 50సం॥ల క్రితం రిజర్వాయర్‌ను నిర్మించారు. ఈ రిజర్వాయర్ నుండి దాదాపు 22గ్రామాలకు తాగునీటి సరఫరా అవుతుంది. రిజర్వాయర్ నీటి సామర్థ్యం 6అడుగులు ఉంది. అయితే ఏళ్ల తరబడి రిజర్వాయర్‌లో పూడిక పేరుకుపోవడంతో నీరు నిల్వ ఉండడం లేదు. ఎల్ఎల్‌సి కాలువలో నీరు పారుతున్నప్పుడు రిజర్వాయర్ లో నీరు నిల్వ చేసుకోవాలి. అయితే రిజర్వాయర్‌లో పూడిక పేరుకుపోవడంతో కేవలం 4అడుగులు మాత్రమే నీరు ఉంటున్నాయి. ప్రస్తుతం ఎల్ఎల్‌సి కాలువకు నీరు బంద్ అయ్యింది. దీంతో చింతకుంట రిజర్వాయర్‌లో పూర్తిస్థాయిలో నీరు ఇంకిపోవడంతో నెలరోజుల నుండి 22గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆ గ్రామాల ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. చింతకుంట రిజర్వాయర్ నుండి చిప్పగిరి మండలంలోని డేగులపాడు, బంటనహాల్, ఏరూరు,నగరడోన తదితర గ్రామాలకు కూడా నీరు సరఫరా అవుతుంది. రిజర్వాయర్‌లో పూర్తిస్థాయిలో నీరు ఇంకిపోవడంతో ఎండిపోయి నెరలు బారింది. దీంతో తాగునీటి కోసం చింతకుంట, సిరిగాపురం, కొక్కరచేడు, బేవినహాల్, సాకిబండ గ్రామాల ప్రజలు తాగునీటి కోసం ట్రాక్టర్ల ద్వారా,ఎద్దుల బండ్ల ద్వారా కర్ణాటక రాష్ట్రంలో కారేకల్లు, జాలెహాల్, గోనేహాల్ నుంచి మినరల్ వాటర్ తెచ్చుకుంటున్నామని ప్రజలు వాపోతున్నారు. రిజర్వాయర్‌లో పూడిక పేరుకుపోవడంతోనే నీరు నిల్వ ఉండకుండ ఇంకిపోతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. రిజర్వాయర్‌లో..

• వివరాలు 2లో

# నరకం చూపిస్తున్న..పెద్దాసుపత్రి..!

: 20 రోజులుగా పని చేయని ఏసీలు
: ఉక్కపోతతో అల్లాడుతున్న ఏఎంసీలోని రోగులు
: ఉన్న జబ్బులకు తోడు డిహైడ్రేషన్ సమస్య
: కోట్లు ఖర్చు చేస్తున్నా పేదలకు సరిగా అందని వైద్యం






**ప్రాణాపాయంలో ఉన్న రోగులు ఆస్పత్రిలో చేరేవరకు నరకం అనుభవిస్తారు. వివిధ సమస్యలతో, నొప్పులతో, బాధలతో తీవ్ర ఇబ్బందికి గురవుతారు. ఆస్పత్రిలో చేరారంటే చాలు వైద్యులు ఉపశమనం కలిగిస్తారు. కానీ కర్నూలు జనరల్ ఆస్పత్రిలో ఇందుకు పూర్తిగా వ్యతిరేక పరిస్థితి నెలకొంది. రోగులు ఆసుపత్రిలో చేరినంతవరకు కొంతమేరకే ఇబ్బందులకు గురవుతారు కానీ... ఆస్పత్రిలో చేరాక పూర్తిస్థాయిలో నరకం చవిచూడాల్సిందేనని బాధితులు వాపోతున్నారు. ఇదెక్కడి విడ్డూరం అని చాలామంది ఆశ్చర్యపోతున్నా... వాస్తవ పరిస్థితి మాత్రం ఇదే.**

కర్నూలు, జూన్ 21, ప్రభాతవార్త : ముఖ్యంగా ప్రాణాపాయ రోగులకు చికిత్సను అందించే ఏఎంసి (అక్యూట్ మెడికల్ కేర్) విభాగంలో చికిత్స తీసుకుంటే ఎంతటి ప్రాణపాయ పరిస్థితుల్లో ఉన్నవారికైనా రోగం నయమై ప్రాణాలు నిలబడతాయని ఆశ కలుగుతుంది. కానీ ఇక్కడి ఏఎంసీలో చేరితే ఉన్న రోగం నయం కావడం విషయం ఎమో కాని అదనంగా మరికొన్ని అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. అసలే తీవ్ర అనారోగ్యంతో ఉన్నవారు ఏఎంసీలో చేర్పించబడతారు. అక్కడి వైద్యులు ఇచ్చే మందులు, బ్యాలెన్స్ డైట్ వలన శరీరంలో ఆకలి, వేడి పెరిగి రోగికి ఆరాటం మొదలవుతుంది. ఆ పరిస్థితిని అదిగమించేందుకు ప్రపంచంలోని ప్రతి ఆసుపత్రిలో ఏఎంసి విభాగంలో ఏసీలు అమర్చుతారు. రోగులకు మందుల వలన, జబ్బుల వలన వచ్చే వేడిని కంట్రోల్ చేసి వాళ్లు త్వరగా కోలుకునేందుకు చల్లటి వాతావరణం కూడా ఎంతగానో ఉపయోగపడుతుంది. అయితే ఐదు జిల్లాల ప్రజలకు వైద్య సేవలు అందించే కర్నూలు జనరల్ ఆస్పత్రిలో ఏఎంసీ విభాగంలో ఏసీలు గత 20 రోజులుగా పనిచేయడం లేదు. అసలే వర్షాలు ఆలస్యమై ఎండలు పెరగడంతో తీవ్ర ఉక్కపోత నెలకొంది. ఈ పరిస్థితులలో ఏఎంసీల రోగుల పరిస్థితి చెప్పనవసరం లేదు. అక్కడ అందించే యాంటీబయోటిక్ మందుల వలన శరీరం మరింత వేడెక్కింది. అదే క్రమంలో ఏసీలు లేకపోవడం వలన కలిగే ఉక్కపోత కారణంగా బాడీ డిహైడ్రేషన్‌కు గురవుతుంది. దీంతో రోగులు బ్రతికుండగానే నరకం చూస్తున్నారు. డీహైడ్రేషన్ కారణంగా శరీరలో వాటర్ లెవల్ ్స తగ్గడంతో మందుల పనితీరు కూడా తగ్గుతుంది. దీంతో పది రోజులకు కోలుకోవాల్సి రోగి ఇరవై రోజులకు కొలుకుంటారు. లేదా మరింత జాప్యం కలుగవచ్చు. అదీ కాదంటే డీహైడ్రేషన్ కారణంగా శరీరంలో బాగా ఉన్న ఇతర ఆర్గాన్స్‌కు జబ్బున పడి కొత్త రోగాలు వచ్చే అవకాశం ఉంది. కోట్ల రూపాయల వ్యయంతో నిర్వహిస్తున్న ఆసుపత్రిలో కనీసం ప్రాణాపాయ రోగులకు కూడా ఏసీ అందించలేని దయనీయ పరిస్థితిలో మన ఆసుపత్రి యాజమాన్యం ఉందా..? లేక అక్కడి పరిస్థితులను చక్కదిద్దలేని స్థితిలో జిల్లా యంత్రాంగం ఉందా...? అదీ కాఆదంటే పేద ప్రజలకు అందించే వైద్య పట్ల ప్రభుత్వానికే చిత్త శుద్ధి లేదా..? అనే ప్రశ్నలు బహిరంగంగా విన్పిస్తున్నాయి.

# పత్తి పంటలో.. ఎర్రతెలుగు పచ్చదోమ

గోనెగండ్ల జూన్ 21 ప్రభాతవార్త : పత్తి పంట సాగులో ముందు జాగ్రత్తలు తీసుకుంటు ఎర్రతెగులు, పచ్చదోమ నివారణ సాధ్యం అవుతుందని ఎమ్మిగనూరు ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ,గోనెగండ్ల ఏవో హేమలత అన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో చాల ప్రాంతాలలో ఎండ వేడిమికి పత్తి పంటకు ఎర్రతెగులు,పచ్చదోమ సోకి పంట నాశనమైందని వారు తెలిపారు.ఎమ్మిగనూరు డివిజన్‌లో ఇప్పటి వరకు గోనెగండ్ల మండలంలో అత్యధికంగా 12వేల హెక్టార్లలో పత్తి పంట సాగు అయిందని తెలిపారు.అయితే దాదాపు వెయ్యి ఎకరాల పైగానే ఎండవేడిమి తాళలేక పంటకు ఎర్రతెగులు సోకిందని చాల మంది రైతులు మూగజీవాలకు గ్రాసంగా వదిలివేశారని తెలిపారు.నివారణ కోసం 14.0.35 మందును ఒక లీటర్ నీటికి 5గ్రాములు కలుపుకొని సాయంత్రం వేళలో పిచికారి చేసుకోవాలని ఈ పిచికారి తరువాత ఐదు రోజులకు ఫార్ములేషన్ 4లేదా ఫార్ములేషన్ 6లను ఒక లీటర్ నీటిని 5గ్రాములు కలుపుకొని పిచికారి చేయాలని సూచించారు.





# సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు జేసీ ఎన్.మౌర్య



కర్నూలు, జూన్ 21, ప్రభాతవార్త : జిల్లాలో రీ సర్వే పూర్తయిన 67 గ్రామాల్లోని 59 చివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలను ప్రారంభించడం జరిగిందని, పజలు ఆ సచివాలయాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని జాయింట్ కలెక్టర్ నారపరెడ్డి మౌర్య సూచించారు. బుధవారం జాయింట్ కలెక్టర్ ఈ అంశంపై మాట్లాడుతూ అమ్మకాలు, గిఫ్ట్ డీడ్, వీలునామా,మార్ట్ గేజ్ అంశాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ సేవలను ఈసచివాలయాల నుంచే చేసుకోవచ్చని జాయింట్ కలెక్టర్ తెలిపారు. వీటితోపాటు మ్యుటేషన్స్, సబ్ డివిజన్స్, ల్యాండ్ కన్వర్షన్ సేవలు కూడా సచివాలయాల్లో అందుబాటులో ఉన్నాయని జెసి తెలిపారు. సచివాలయాలకు సంబంధించిన పంచాయతీ సెక్రెటరీ జాయింట్ సబ్ రిజిస్ట్రార్ గా వ్యవహరిస్తారని జెసి తెలిపారు. రిజిస్ట్రేషన్ అంశాలలో రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు పంచాయతీ సెక్రెటరీ లను గైడ్ చేస్తారన్నారు. సచివాలయాల్లో రిజిస్టర్ అయిన అన్ని వివరాలు సబ్ రిజిస్టార్ కు వెళ్తాయని, వాటిని పరిశీలించి రిజిస్ట్రేషన్ అధికారులు ఆమోదం తెలుపుతారని జేసీ తెలిపారు. ఇప్పటివరకు 67 గ్రామాల్లోని 59 సచివాలయాల్లో 124 రిజిస్ట్రేషన్లు చేయడం జరిగిందని జెసి వివరించారు.రిజిస్ట్రేషన్ సేవలను ప్రారంభించిన సచివాలయాలు కల్లూరు మండలంలో ఒకటి, కోడుమూరు మండలంలో ఒకటి,కౌతాళం మండలంలో ఐదు, కోసిగి మండలంలో 6,మంత్రాలయం మండలంలో మూడు, నందవరం మండలంలో నాలుగు, గోనెగండ్ల మండలంలో ఏడు, ఎమ్మిగనూరు మండలంలో 12, పెద్దకడబూరు మండలంలో 11,ఆదోని మండలంలో ఒకటి, ఆలూరు మండలంలో రెండు, ఆస్పరి మండలంలో రెండు, దేవనకొండ మండలంలో రెండు, తుగ్గలి మండలంలో ఒకటి, పత్తికొండ మండలంలో ఒకటి అని జేసీ తెలిపారు.. ఇందులో కల్లూరు మండలంలోని పందిపాడు సచివాలయంలో అత్యధికంగా 64 రిజిస్ట్రేషన్లు చేసినట్లు జెసి వివరించారు.. జిల్లాలోని ప్రజలు సచివాలయాల్లో కల్పించిన రిజిస్ట్రేషన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# యోగా నిరంతర అభ్యాసం

: యోగ దినోత్సవంలో కర్నూలు ఏంపీ డాక్టర్ సంజీవ్ కుమార్



కర్నూలు, జూన్ 21, ప్రభాతవార్త : యోగ సాధనలో మందులకు తగ్గని వ్యాధులను కూడా యోగ ముద్రల ద్వారా నివారించుకోవచ్చునని, ప్రతి మనిషి యోగా ను నిరంతర అభ్యాసంగా మార్చుకొని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని కర్నూలు పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సంజీవ్ కుమార్ అన్నారు. బుధవారం నగరంలోని ఔట్ డోర్ స్టేడియంలో అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆయుష్ శాఖ కర్నూలు, నగర పాలక సంస్థ ,ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా కార్యక్రమానికి కర్నూలు పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సంజీవ్ కుమార్, నగరపాలక మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ, జాతీయ యోగ సంఘం సభ్యులు శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా డిస్ట్రిక్ట్ యోగ అసోసియేషన్ కె విజయ్ కుమార్ వారి బృందం వారు కార్యక్రమానికి హాజరైన యోగ సాధకులు, పాఠశాల విద్యార్థులతో సామూహికంగా యోగాసనాలను, కపాలభాతి, ప్రాణాయామం, ధ్యానం వంటి కార్యక్రమాలను చేయించారు. యోగ సాధకులు ప్రసన్న, నల్లని లు నృత్యంతో యోగాసనాలు వేసి చూపరులను ఆకట్టుకున్నారు. పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సంజీవ్ కుమార్ మాట్లాడుతూ పూర్వం నాట్యంతో మానవాళికి ఎంతో నేర్పించారన్నారు. మొత్తం ప్రపంచానికి అంత గురువు మన భారతదేశం అని ఎంపీ కొనియాడారు. యుద్ధతంత్రంలో గాని, వాణిజ్యపరంగా, వ్యాపారపరంగా, ఆరోగ్యపరంగా ముందంజలోఉందన్నారు.యోగా అంటే ధ్యానం మాత్రమే కాదని, మన మనస్సు శరీరముల మధ్య సమన్వయం కలగా చేయడమే యోగ అని అన్నారు. యోగా అన్నది 5000 సంవత్సరాల కింద నుంచి ఉన్నదని ..



2లో

# నలుగురు ఎంఇఓలకు షోకాజ్ నోటీసులు జారీ

- విద్యార్థులు యూనిఫాంతో పాఠశాలకు హాజరుకాని పక్షంలో హెచ్‌ఎంలపై చర్యలు
- బయోమెట్రిక్ హాజరు నూరుశాతం చూపకపోతే హెచ్‌ఎంలపై చర్యలు - జిల్లా కలెక్టరు



నంద్యాల విద్య, జూన్ 21, ప్రభాతవార్తః జిల్లాలోని దొర్నిపాడు, కొలిమిగుండ్ల, చాగలమర్రి, గడివేముల మండలాల ఎంఇఓలకు జెవికె కిట్లు, నాడు నేడు పనులు పురోగతి లేని కారణంగా షోకాజ్ నోటీసులు జారీచేయాలని జిల్లా కలెక్టరు డిఇఓను అదేశించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణిలో పారదర్శకత ఉండాలని గురువారం సాయంత్రంలోగ 80 శాతం కిట్లను పూరి చేయాలని జిల్లా కలెక్టరు డా.మనజీర్ జిలాని సమూన్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను అదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని విడియోకాన్ఫరెన్స్‌లో జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణి, నాడు నేడు ప్రగతి పనులపై మండలాల వారికి సమీక్ష సమావేశం నిర్వహించారు. డిఇఓ సుధాకర్‌రెడ్డి, సమగ్ర శిక్షా సెక్టోరియల్ అధికారి లలిత కుమారి అధ్వర్యంలో హెచ్‌ఎంతో మాట్లాడారు. ఈసంరదర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సరఫరా చేసిన యూనిఫాం దుస్తులను వారం రోజుల్లో కుట్టించుకొని విద్యార్థులు ధరించి పాఠశాలలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం సరఫరా చేసిన షూష్, పాఠ్యపుస్తకాలు, విద్యార్థులు క్రమపద్ధతిలో వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో తాను పాఠశాల తనిఖీ సమయంలో విద్యార్థులు యూనిఫాం దుస్తులు, బూట్లు ధరించకపోతే సంబంధిత ఉపాధ్యాయులై బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. నాడు నేడు పనుల కింద 8 రకాల సివిల్ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని ఇంజనీర్లను అదేశించారు. బడిబయట ఉన్న బడిఈడు పిల్లల సర్వేను పూర్తిస్థాయిలో పెండింగ్‌లో లేకుండా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బయోమెట్రిక్ హాజరు నూరుశాతం చూపకపోతే అయా హెచ్‌ఎంలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటి డిఇఓ మహాబూబ్ బేగ్, సర్వశిక్ష అభియాన్ అధికారులు పాల్గొన్నారు.

# నాడు ఉన్న ఎయిడెడ్ హైస్కూల్ నేడు వైసిపి ప్రభుత్వ హయాంలో మాయం..!

- ఆదోని పట్టణంలో ఉన్న ఎయిడెడ్ హైస్కూళ్లు మూసివేత
- టిడిపి మాజీ ఇంచార్జ్ గుడిసె కృష్ణమ్మ,మదిరె భాస్కర్‌రెడ్డి, మాన్వి దేవేంద్రప్ప



ఆదోని, జూన్ 21,ప్రభాతవార్త : ఆదోని నియోజకవర్గంలో ఆదోని మున్సిపాలిటీ పరిధిలో 42వార్డులకు గాను ప్రభుత్వ హైస్కూళ్లు ఇప్పటివరకు ప్రభుత్వ మూసివేతకు సిద్దమైన ప్రముఖ ఎల్లేమల్లేశప్ప కన్నడ హైస్కూల్ మూసివేత దిశగా ఉందని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చెప్పడం ఒకటి చేయడం మరొకటి అని తెదేపా మాజీ ఇంచార్జ గుడిసె కృష్ణమ్మ,తెదేపా సీనియర్ నాయకులు మదిరె భాస్కర్‌రెడ్డి,మాన్వి దేవేంద్రప్పలు ఆరోపించారు. బుధవారం టిడిపి నేతలు ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందచేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఆదోని మున్సిపాలిటీ పరిధిలో 42వార్డులకు గాను ఆదోని మున్సి పల్ హైస్కూల్,ఆర్‌ఆర్ కాలనీ హైస్కూల్, మసూదియా ఉర్దూ హైస్కూల్, అంబర్పేట్ బాలికల హైస్కూల్, బాలికల గర్ల్స్ హైస్కూల్, ఆర్‌సిఎం హైస్కూల్, క్రాంతి నగర్‌లో నిర్వహి స్తున్న హైస్కూల్ ఇవి దాదాపుగా ఆదోని మున్సి పాలిటీలో 2లక్షల కుటుం బాలకు గాను మూడు హైస్కూల్స్ మాత్రమే నిర్వహి స్తున్నారన్నారు. ఇందులో భాగంగా వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎయిడెడ్ స్కూల్‌లో 8స్కూళ్ల బంద్ కావడంతో పట్ట ణంలో చదువుకునే పిల్లలకు సీట్లు దొరక్క పోవడంతో విద్యార్థుల తల్లి దండ్రులు, విద్యార్థులు ఆందోళనలో ఉన్నారన్నారు. ఆదోని పట్టణం నందు ముస్లిం మైనార్టీ విద్యార్థిని,విద్యార్థులకు మసూదియా హైస్కూ ల్, ఉర్దూ అండర్‌పేట్ బాలబాలికల హైస్కూల్ మాత్రమే నిర్వహిస్తున్నారన్నారు. ఇవి కూడా పట్టణం నందు మైనార్టీ విద్యార్థులు చదవడానికి ఆసక్తిగా ఉన్న హైస్కూల్‌లో పోవడానికి దూరమవుతుందని వారి తల్లిదండ్రులు కూడా చదివించడానికి ఇష్టపడడం లేదన్నారు. పట్టణంలో మిగతా ఎస్‌సి,ఎస్‌టి,బిసి,ఓసి విద్యార్థులు ఆదోని నడిబొడ్డున ఉన్నటువంటి నెహ్రూమెమోరియల్, మున్సిపల్ హైస్కూల్ ఎటు తిరిగి చూసినా 5కి.మీల వరకు ఉందని పర్వతాపురం, రాయనగర్,అమరావతి నగర్, టిజిఎల్ కాలనీ, హనుమాన్‌నగర్, కిలిచిన పేట, వాల్మీకినగర్, గౌలిపేట్, కుమ్మరి వీధి పట్టణం నుండి ఎటు చూసినా కూడా విద్యార్థులు చదవడానికి ఆసక్తిగా ఉన్న పదవ తరగతి హైస్కూళ్లు మూతబడడంతో కొంతమంది విద్యార్థులు స్కూల్ నుంచి డ్రాప్‌ఔట్ అవుతున్నారన్నారు. ప్రస్తుతం వైసిపి ప్రభుత్వం చేస్తున్నటువంటి నాడు-నేడు అనే పేరుతో విద్యార్థులకు మంచి చదువు అన్నాడని ఆదోనిలో మంచి జరగడం లేదు చెడుగా జరుగుతున్నదన్నారు. మరి ప్రస్తుత ఎమ్మెల్యే, ప్రభుత్వ ఉన్నతాధికారులు విద్యార్థుల చదువులు పట్టించుకోవడం లేదన్నారు. విద్యార్థుల సమస్యలు పట్టించుకోకుండ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఎక్కడ ఆదోనిలో నాడు-నేడు స్కూల్ నాడు ఉన్న స్కూళ్ల నేడు మూసేస్తున్నారన్నారు. మీ ప్రభుత్వ హయాంలో విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. మున్సిపాలిటీ నందు దాదాపు 100సం॥లు పైబడిన స్కూల్స్ ఉన్నాయన్నారు. ప్రభుత్వ ఆధీనంలో ఎయిడెడ్ స్కూల్స్ నిర్వహిస్తున్నారని ఇందులో భాగంగా పట్టణం నందు 2020నుండి 2023వరకు ఇప్పటివరకు మూతబడిన స్కూళ్ల వీరసేన కన్నడస్కూల్,ఆలగంగమ్మ స్కూల్,మిఠాయి చెన్నబసప్ప స్కూల్,పొట్టి శ్రీరాములు స్కూల్,రాయమిల్స్ హైస్కూల్, టిజిఎల్ హైస్కూల్,జిహేశ్వర స్కూల్,వైఎంకె హైస్కూల్‌లు మూతబడ్డాయని ఇవి ఇన్ని స్కూళ్లు బంద్ కావడంతో పట్టణంలో చదువుతున్న విద్యార్థులు సీట్ల కొరకు దాదాపు 5కి.మీల నుండి రావడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రస్తుతం ఆదోని నడిబొడ్డున ఉన్న మున్సిపల్ హైస్కూల్, నెహ్రూమెమోరియల్ హైస్కూల్ నందు విద్యార్థులు సీట్ల కోసం గత 15రోజుల నుండి విద్యార్థులు,వారి తల్లిదండ్రులు స్కూళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని సీట్ల కొరకు తిరిగి తిరిగి అలసిపోయామనిఇ విద్యార్థులను స్కూల్ మానేపించడం మంచిదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. నాయకులు సాంబగల్ ఫకృద్దీన్,బసాపురం రామస్వామి,గుడిసె శ్రీరాములు, వద్దేమాన్ గోపాల్,సోమశేఖర్‌రెడ్డి, మాజీసర్పంచ్ కారుమంచప్ప, నారాయణపురం షేక్షావలి,వాల్మీకి రాముడు, శివయ్య స్వామి, సాదిక్‌వలి,నాయకులు పాల్గొన్నారు.

# ప్రపంచ దేశ మానవాళికి యోగ దోహదం



నంద్యాల క్రైం, జూన్ 21, ప్రభాతవార్తః ప్రపంచ దేశ మానవాళికి యోగ ఎంతో దోహదపడుతుందని మనిషి మానసిక శారీరక ఆరోగ్యానికి ఎంతగానో మేలు చేస్తుందని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి వెంకటరాముడు, ఎఆర్ అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, ఎఆర్ డిఎస్పీ రంగముని, ఆర్ఎస్ఐ అల్లావుద్దిన్‌లతో కలిసి యోగ నిర్వహించారు. వివిధ యోగా అసనాలను చేస్తు వాటి వల్ల కలిగే ప్రయోజనాలు ఎస్పీ తెలియజేశారు. శారీరక, మానసిక వ్యాధులను యోగ నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. జీవితంలో యోగాను అలవర్చుకొని ఆరోగ్యవంతులై ఉండాలని సిబ్బందికి సూచించారు. ప్రతిరోజు యోగతో పాటు వ్యాయామం చేస్తు ఆరోగ్యంగా ఉంటు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఐలు, స్పెషల్‌పార్టీ సిబ్బంది, ఎఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

# మేనిఫెస్టోని సోషల్ మీడియా వేదికగా ప్రజల్లోకి తీసుకెళ్లండి

కల్లూరు, జూన్ 21, ప్రభాతవార్తః పాణ్యం నియోజకవర్గ ఐటిడిపి సభ్యులతో సమావేశం మాజీ ఎమ్మెల్యే,పాణ్యం ఇంచార్జి గౌరుచరితా రెడ్డి, నంద్యాల పార్లమెంటు అధ్యక్షులు గౌరు వెంకటరెడ్డి అధ్వర్యంలో నిర్వహించారు.వారు మాట్లాడుతూ మహానాడులో ప్రకటించిన మీని మేనిఫెస్టోని సోషల్ మీడియా వేదికగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. ఈసమావేశంలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఘనంగా ఎస్‌డిపిఐ 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**హొళగుంద,జూన్ 21,ప్రభాతవార్త :**హొళగుంద సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా ఎస్‌డిపిఐ ఆధ్వర్యంలో పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలూరు అసెంబ్లీ అధ్యక్షులు ఎం సైఫుల్లా జెండాను ఎగురవేశారు. తదనంతరం సైఫుల్లా మాట్లాడుతూ ఎస్‌డిపిఐ పార్టీ దేశంలో 23రాష్ట్రాలలో పనిచేస్తుందని మరియు పార్టీ యొక్క నినాదం భయం నుండి స్వేచ్ఛ ఆకలి నుండి స్వేచ్ఛ అని దేశంలో ఏ ఒక్కరు కూడా భయంతో ఆకలితో కాని చావకూడదని ఎస్‌డిపిఐ పార్టీ యొక్క ముఖ్య ఉద్దేశ్యమన్నారు. మన దేశంలో రైతులకు సరైన వసతులు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర లేక చాలామంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. రైతులు బ్యాంకులలో రుణాలు తీసుకుని పంటలు వేసి పంట సరిగ్గా పండకపోగా రుణాలు కట్టే స్థితిలో లేనప్పుడు ప్రభుత్వం ఆదుకోకపోవడంతో వారి పొలాలను బ్యాంకు వారు జప్తు చేసుకోవడం జరుగుతుందన్నారు. మన దేశంలో రైతే రాజు అంటారని ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని వారు కోరారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు,పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ రహిమాన్,ఉపాధ్యక్షులు ఎస్ఎండి షఫీ,అసెంబ్లీ సభ్యులు కెటి భాష,ఉబేదుల్లా,వార్డు సభ్యులు ఎఫ్ హమీద్,కె అబ్దుల్ రెహమాన్,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ సహాయకులతో హసింగ్‌పై సమీక్షా సమావేశం

**పగిడ్యాల, జూన్ 21,ప్రభాతవార్త :** స్థానిక మండల అభివృధికార్యాలయంలో బుధవారం మండల అభివృద్ధి అధికారి బివి.రమణ ఇంజనీరింగ్ సహాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి మాట్లాడుతూ ఇంజనీరింగ్ సహాయకులు హౌసింగ్ ఇచ్చిన టార్గెట్స్ త్వరితగతిన పూర్తిచేయించవలసిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. స్టేజి కన్వర్షన్ చేయాలనీ సూచించారు.ఈ కార్యక్రమంలో మండలంలోని ఇంజనీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

**జగనన్న సురక్ష పథకంపై శిక్షణ :** మండల పరిధిలోని లక్ష్మాపురం1,2, లక్ష్మాపురం 3, పగిడ్యాల -2 గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా బుధవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జగనన్న సురక్ష పథకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి బివి.రమణ, మండల విస్తరణాధికారి బిఎల్ నాగేంద్రయ్య, ఎంఎల్ఓ బాలయ్య, పంచాయతి కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, గ్రామవాలంటీర్లు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించేందుకే జగనన్న సురక్ష

**ఆదోని రూరల్,జూన్ 21,ప్రభాతవార్త :** ప్రజల యొక్క సమస్యలను పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టిందని డిప్యూటీ తహశీల్దార్ రజనీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయం నందు జగనన్న సురక్ష పథకంపై పంచాయతీ కార్యదర్శులు విలేజ్ రెవెన్యూ ఆఫీసర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని వాలంటరీలు ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలను యాప్‌లో నమోదు చేయాలని నమోదు చేసుకున్న వారికి ఉచితంగా గ్రామాల వారిగా సర్టిఫికెట్లను అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి నాగరాజు,ఏఓ శేఖర్ తదితరులున్నారు.

## ఎస్‌డిపిఐ 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**వెలుగోడు,జూన్ 21,ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పార్టీ కార్యాలయంలో పార్టీ జెండా ఎగురవేసి ఘనంగా నిర్వహించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శ్రీశైలం నియోజకవర్గం ఎస్‌డిపిఐ ప్రధాన కార్యదర్శి హుస్సేన్‌బాష మాట్లాడుతు ఎస్‌డిపిఐ పార్టీ స్థాపించిన అతి తక్కువ సమయంలోనే భారతదేశంలో 17 రాష్ట్రాలలో విస్తరించిందన్నారు. పార్టీ ముఖ్య ఉద్దేశ్యం ఆకలి నుంచి స్వేచ్ఛ, భయం నుంచి స్వేచ్ఛ అన్నారు. బిజేపి అధికారంలోకి వచ్చాక సామాన్య ప్రజల పరిస్థితి చాల దారుణంగా తయారైందన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గం కమిటీ సభ్యులు అమన్, షాహింషా, నంద్యాల జిల్లా కమిటీ మెంబర్ ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

**మాధవరం(మంత్రాలయం),జూన్ 21,ప్రభాతవార్త:**మండల పరిధిలోని మాధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ యోగా దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి.యోగా టీచర్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు.ముందుగా విద్యార్థినీ,విద్యార్థులకు యోగా ప్రాముఖ్యతను వివరించారు.తీవ్ర ఒత్తిడిలో ఉన్నప్పుడు మానసిక ప్రశాంతతకు ప్రతి ఒక్కరూ యోగా చేయాలని సూచించారు.ఈ యోగా చేయడం వలన అనేకరకాల దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాయన్నారు.కాబట్టి తప్పకుండా ప్రతి ఒక్కరూ యోగా నేర్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పిడి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## యోగాను ప్రతి ఒక్కరు జీవితంలో భాగం చేసుకోవాలి

**పగిడ్యాల, జూన్ 21, ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరు యోగాను జీవితంలో భాగం చేసుకోవాలనీ మండల అభివృద్ధి అధికారి బివి.రమణ, తహశీల్దార్ భారతి అన్నారు. మండల పరిధిలోని లక్ష్మాపురం గ్రామ సచివాలయం -1లో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ధ్యానం భాగా ఉపయోగపడుతుందన్నారు.పనివత్తడిని జయించాలంటే యోగా ద్వారా సాధ్యపడుతుందన్నారు. ప్రాణాయామం, ధ్యానం యోగాసాలు చేయడం వల్ల ఆరోగ్యకరంగా ఉండవచ్చునీ మండల అభివృద్ధి అధికారి బివి.రమణ, తహశీల్దార్ భారతి అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణాధికారి బిఎల్. నాగేంద్రయ్య, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నేటి బాలలే రేపటి భావితరాల పౌరులు

**హొళగుంద,జూన్ 21,ప్రభాతవార్త :** నేటి బాలలే రేపటి భావితరాల పౌరులని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం శంకర్‌రెడ్డి,యువనేత ఎస్‌కె గిరిలు అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎల్లార్తి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల మొదటి బహుమతి వెంకటలక్ష్మి,ద్వితీయ బహుమతి మేఘన,మూడో బహుమతి పక్కీరమ్మలకు సర్టిఫికేట్లు,మెడల్స్,నగదు రూ. 3వేలు,రూ. 2వేలు,రూ. 1000లను బహుకరించారు. ఈ సందర్భంగా యువనేత ఎస్‌కె గిరి మాట్లాడుతూ అందరు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. జగనన్న ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దుతున్నారన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 4ఏళ్లలో రూ. 50వేల కోట్లు ఖర్చు పెట్టి విద్యార్థుల భవిష్యత్తుకు పెద్దపీత వేశారన్నారు. ఒక మేనమామగా ఉంటూ పేద విద్యార్థులు కూడా ప్రపంచంలో పోటీ పడాలని ప్రతిరోజు విద్యార్థుల కోసం ఆలోచన చేసే ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ రంగస్వామి,ఉపాధ్యాయులు కబీరు,వెంకటేష్,జిలాని,భాషా,శ్రీవాణి,విద్యార్థులు పాల్గొన్నారు.

## కౌలురైతులకు గుర్తింపు కార్డులు తప్పనిసరి

**హాలహర్వి,జూన్ 21,ప్రభాతవార్త :** కౌలు రైతులకు గుర్తింపు కార్డులు తప్పనిసరిగా ఉండాలని ఏఓ శివశంకర్ అన్నారు. బుధవారం మండలంలోని చింతకుంట గ్రామంలో కౌలురైతులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కౌలురైతుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందని ఆయన అన్నారు. కౌలురైతులు కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలనే లక్ష్యంతో ప్రభుత్వం కౌలురైతులకు గుర్తింపు కార్డులను మంజూరు చేసిందన్నారు. కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఉండడం వల్ల సబ్సీడీ విత్తనాలు,ఎరువులు,మందులు,వ్యవసాయ పరికరాలు కూడా 50శాతం సబ్సీడీతో ఇవ్వడం జరుగుతుందన్నారు. అంతేకాకుండ ఎస్‌సి,ఎస్‌టి కౌలు రైతులకు ప్రభుత్వం 80శాతం సబ్సీడీతో వ్యవసాయ పరికరాలు అందించడం జరుగుతుందన్నారు. చింతకుంట గ్రామంలో దాదాపు 38మంది కౌలురైతులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశామని ఆయన తెలిపారు. గ్రామాల్లో ఎవరైన కౌలురైతులుంటే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సద్దాంహుసేన్,మాజీ ఎంపిపి బసప్ప,విఆర్ఓలు విజయ్,లింగప్ప,అగ్రికల్చర్ అసిస్టెంట్లు,కౌలురైతులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ మోసాల పట్ల జాగ్రత్త వహించాలి

**సింగరాజనహళ్ళి(మంత్రాలయం),జూన్ 21,ప్రభాతవార్త:** ప్రస్తుతం సమాజంలో జరిగే ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు జాగ్రత్తలు పాటించాలని మాధవరం ఎస్ఐ కిరణ్‌బాబు అన్నారు.బుధవారం మండల పరిధిలోని సింగరాజనహళ్ళి గ్రామంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు ఫోన్‌చేసి మీ అకౌంట్‌కు ఓటిపి నంబర్ చెప్పండంటూ అధికంగా ఫేక్ కాల్స్ వస్తున్నాయని డబ్బులువస్తాయన్న ఆశతో తమ అకౌంట్ నంబర్ చెబితే మీ ఖాతాలోని డబ్బులు ఇతరులు డ్రా చేసుకుంటారని తెలిపారు.ప్రతిఒక్క వాహన దారుడు రోడ్డుభద్రతా నియమాలను తప్పకుండా పాటించాలన్నారు.మద్యం సేవించి వాహనాలు నడపడం సరికాదన్నారు.గ్రామాల్లో నాటుసారా,కర్ణాటక మద్యం విక్రయించడం నేరమన్నారు.మహిళల పట్ల గౌరవంగా నడుచుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మధుసుదన్‌రెడ్డి,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అనుమతులు ఉన్న విత్తనాలనే విక్రయించాలి - ఏఓ

**వెల్దుర్తి,జూన్21,ప్రభాతవార్త :** అనుమతులు ఉన్న విత్తనాలనే విక్రయించాలని మండల వ్యవసాయాధికారి (ఏఓ) అక్బర్‌బాష తెలిపారు.మండల కేంద్రమైన వెల్దుర్తి పట్టణంలోని బాలాజీ సీడ్స్,ఫెస్టీసైడ్స్,శ్రీశివసాయిట్రేడర్స్,ధరణి ఫర్టిలైజర్స్,లక్ష్మీనరసింహాట్రేడర్స్ దుకాణాలను బుధవారం ఏఓ ఆకస్మిక తనిఖీ చేశారు.దుకాణంలో స్టాక్ రిజిస్టర్లు,బిల్‌బుక్స్,స్టాక్‌బోర్డును పరిశీలించారు.ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులకు విత్తనాలు విక్రయించే సమయంలో లాట్ నెంబర్,ఇతర సమాచారం కనపరిచే విధంగా బిల్లు ఇవ్వాలన్నారు.ఎంఆర్‌పి ధరకే విక్రయించాలన్నారు.ఎలాంటి అనుమతులు లేని వాటిని అమ్మితే విత్తన చట్టం కింద చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

## ఘనంగా జగనన్న ఆణిముత్యాల అవార్డు పంపిణి కార్యక్రమాలు

**వెలుగోడు,జూన్ 21,ప్రభాతవార్త:** స్థానిక జడ్పీపాఠశాలలో మంచి మార్కులు సాధించి ప్రతిభ చాటిన విద్యార్థులకు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆదేశాల మేరకు జగనన్న అణిముత్యాల అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బుధవరం జరిగిన ఈ కార్యక్రమంలో యం.పి.పి. లాలం రమేష్, వైకాప నాయకులు షంషీర్‌ఆలీ మాట్లాడుతు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస.జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో ఎన్నో మార్పులు చేసి ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించి ఉన్నస్థాయిలో ఉండేలా చేయడమై జగనన్న ధ్యేయమని వారు తెలిపారు. అనంతరం రపతిభ చాటిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు, మెమోంట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎం.ఇ.ఓ. బ్రహ్మంనాక్, ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, మోడల్ స్కూల్ వైస్ ప్రినిసపాల్ పుల్లయ్య, కస్తూర్భా స్కూల్ ఎస్.ఓ.దేవి, విద్యా కమిటీ చైర్మన్ అచ్చయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు

**చాగలమర్రి,జూన్21,ప్రభాతవార్త:** ఎరువులు,విత్తనాలు,పురుగు మందులను ఎమ్మార్పీ ధర కంటే అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని మండల వ్యవసాయశాఖ అధికారి రంగనేతాజీ హెచ్చరించారు.చాగలమర్రి పట్టణంలోని 2వ రైతుభరోసా కేంద్రంలో విత్తన,ఎరువు,పురుగు మందుల డీలర్లతో సమావేశాన్ని ఏర్పాటుచేశారు.ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలుచేసిన ఎరువులు,పురుగు మందులు,విత్తనాలకు దుకాణదారులు బిల్లులు ఖచ్చితంగా ఇవ్వాలన్నారు.సరైన పత్రాలు లేకుండా ఎరువులు,పురుగు మందులు అమ్మినట్లయితే కఠిన చర్యలు తీసుకుని దుకాణాన్ని సీజ్ చేయడం జరుగుతుందన్నారు.ప్రతి దుకాణదారుడు స్టాక్ పట్టికను ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో ఎరువు మందుల డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

## గృహనిర్మాణాలు వేగవంతం చేయాలి

**చాగలమర్రి,జూన్21,ప్రభాతవార్త:** చాగలమర్రి పట్టణంలోని జగనన్న లేఔట్లలో చేపట్టిన గృహనిర్మాణాలను జూలై 15 నాటికి వేగవంతం చేసి పూర్తి చేయాలని ఎంపిడివో మహబూబ్ దౌలా కోరారు.బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజనీరింగ్ సహాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఎంపిడివో మాట్లాడుతూ జగనన్న లేఔట్లలోని ఇళ్ల నిర్మాణాలు జూలై 15నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు.ఇంజనీరింగ్ సహాయకులు లబ్దిదారులకు అవగాహన కల్పించి నిర్ణీత తేది నాటికి గృహ నిర్మాణాలు పూర్తయ్యేలా కృషి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో హౌసింగ్ ఏఈ షఫివుల్లా,సచివాలయ ఇంజనీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

## బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి

**చాగలమర్రి,జూన్21,ప్రభాతవార్త:** బడిఈడు పిల్లలు బడిలో ఉండకుండా కూలీ పనులకు పంపించడం చట్టరీత్యానేరమని జిల్లాలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూనలకు కృషి చేస్తామని నంద్యాల జిల్లా సహాయ కార్మిక అధికారులు మురళీకృష్ణ,సమీర్,విద్యావతమ్మలు తెలిపారు.చాగలమర్రి పట్టణంలో బుధవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కార్మికశాఖ,ఐసీడీఎస్,పోలీస్‌శాఖల ఆధ్వర్యంలో స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు.పట్టణంలోని వ్యాపార సముదాయాలు,మెకానిక్ షెడ్‌లు,కుటీర పరిశ్రమలు తదితర ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహించి కౌన్సిలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14సంవత్సరాలోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే యజమానులు శిక్షార్హులవుతారన్నారు .14సంవత్సరాలలోపు పిల్లల తల్లిదండ్రులను తమ తమ పిల్లలను ఖచ్చితంగా బడులకు పంపాలని వారు కోరారు.కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు చంద్రకళ,హసీనా,వహీదా,రహమాద్,పోలీస్ సిబ్బంది శ్రీరాములు పాల్గొన్నారు.

## జగనన్న సురక్ష పథకాన్ని విజయవంతం చేయండి

**చాగలమర్రి,జూన్21,ప్రభాతవార్త:** ప్రభుత్వం చేపట్టనున్న జగనన్న సురక్ష పథకాన్ని విజయవంతం చేయాలని ఎంపిడివో మహబూబ్ దౌలా కోరారు.బుధవారం మండలంలోని బివనిపెంట సచివాలయాన్ని తనిఖీచేసి అనంతరం సర్పంచ్ బాలీశ్వరరెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన వలంటీర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు.ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకాన్ని ముఖ్యమంత్రి ఈనెల 23వ తేదిన ప్రారంభిస్తారని ఈనెల 24 నుంచి వలంటీర్లు,గృహసారథులు,సచివాలయ కన్వీనర్లు తమ పరిధిలోని ఇంటింటికి వెళ్లి వారి సమస్యలను,అవసరమైన సర్టిఫికెట్లకు సంబంధించిన అంశాలను నమోదు చేయాలన్నారు.వీరికి సచివాలయాల వద్ద శిబిరాలు ఏర్పాటుచేసి సంక్షేమ పథకాల సర్టిఫికెట్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమం పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్,సచివాలయ సిబ్బంది,వలంటీర్లు పాల్గొన్నారు.

## యోగా భారతదేశానికి పుట్టినిల్లు

### - ఆయుర్వేద డాక్టర్ కె.మాధవరావు చౌదరి

**బనగానపల్లె,జూన్21,ప్రభాతవార్త:** యోగా భారతదేశానికి పుట్టినిల్లని బనగానపల్లె ప్రభుత్వ ఆయుర్వేద డాక్టర్ కె.మాధవరావు చౌదరి అన్నారు.బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.స్వర్ణలతాదేవి ఆధ్వర్యంలో విద్యార్థులు నిర్వహించిన అవగాహన ర్యాలీని కె.మాధవరావు జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా భారతదేశంలో ఎన్నో శతబ్ధాలకు పూర్వం గుర్తింపు పొందిందని చివరకు ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిందని అందుకే యోగాను భారతదేశానికి పుట్టినిల్లుగా భావిస్తారని ఆయన తెలియజేశారు.ప్రతి రోజు యోగా చేయడం వల్ల గొప్ప ఉపశమనం లభిస్తుందన్నారు.అనంతరం వ్యాయామ విద్య ఆధ్వర్యంలో విద్యార్థులు,అధ్యాపకులతో నిర్వహించిన యోగా అవగాహన ర్యాలీ కళాశాల నుండి పెట్రోల్‌బంకు కూడలి వరకు నిర్వహించారు. అధ్యాపకులు ఫిజికల్ డైరెక్టర్ విజయకుమారి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ బడేసాహెబ్,సూర్యనారాయణరెడ్డి ,సుధాకర్‌రెడ్డి, రామకృష్ణ,వసుంధర,మహమ్మద్ గౌస్,కోటేశ్వరరావు,నాగరాజారెడ్డి,నరేంద్రనాథ్‌రెడ్డి,వరలక్ష్మి, వహీదా,నీతమ్మ పాల్గొన్నారు.

## కబడ్డీ బార్స్ ఏర్పాటు

**ఆదోనిలీగల్, జూన్21, ప్రభాతవార్త ;** ఆదోని ఫిలిప్స్ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలోడుబల్ బార్, సింగిల్ బార్ కబడ్డీ కోచ్‌లు అమర్‌ప్రకాష్, రవి సొంత డబ్బులు రూ.8 వేలతో బుధవారం సింగిల్ మరియు డబుల్ బార్స్ ఏర్పాటు చేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ అరుణజ్యోతినగర్‌లోని పెద్ద మదిగేరి అరుళయ్యగుడి వెనక కబడ్డీ కోర్టులో యువత, పిల్లల సంక్షేమం కోసం ఫిలిప్స్ టీచర్ గుర్తుగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థులు, యువకులు కబడ్డీలో రాణించాలని పిలుపునిచ్చారు.

## శంకర్ మృతదేహంతో ధర్నా....

**ఆదోనిటౌన్, జూన్21, ప్రభాతవార్త ;** స్థానిక ఎమ్మిగనూరు సర్కిల్‌లో హత్యకు గురైన శంకర్ మృతదేహంతో బుధవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో రోడ్డుపై ధర్నా చేపట్టారు. ఈ మేరకు మహాజన సోషలిస్ట్ పార్టీ కర్నూలు జిల్లా కన్వీనర్ ఎస్.సుభాష్‌చంద్ర, జిల్లా నాయకులు బండారి హనుమంతు మాట్లాడారు. ప్రణాళిక ప్రకారంగా స్నేహితులే పిలుచుకొని వెళ్లి హత్య చేశారని ఆరోపించారు. హత్య చేసిన వారిని వెంటనే కఠినంగా శిక్షించాలని, మృతుడి కుటుంబం కోసం ప్రభుత్వం రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా, ఐదు ఎకరాల భూమి, ఐదు సెంట్ల స్థలం శంకర్ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. గంటపాటు రోడ్డుపై ధర్నా చేపట్టడంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఆదోని వన్‌టౌన్, టూటౌన్ సీఐలు విక్రమసింహా, శ్రీనివాసనాయక్, ఎస్ఐలు, సిబ్బంది ధర్నా చేస్తున్న ప్రాంతానికి చేరుకొని వారితో మాట్లాడి ధర్నాను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఆదోని మండల ఇన్‌చార్జి బండారి గిడ్డయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ మాజీ పట్టణాధ్యక్షులు ఎం.జగన్ మాదిగ, ఎంఎస్‌పీ ఆస్పరి మండల అధ్యక్షులు రామాంజనేయులు, ఆస్పరి మండలాధ్యక్షులు చిన్నసంజప్ప మాదిగ, ఆస్పరి మండల నాయకులు సుధాకర్‌మాదిగ, ఆదోని ఎమ్మార్పీఎస్ నాయకులు నరసింహులు మాదిగ, కాంతరాజు మాదిగ, విజయరాజు మాదిగ, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## త్రిపురలో బిజెపి వల్ల నష్టపోయిన భాధితులకు విరాళాల సేకరణ

**ఆత్మకూరు,జూన్ 21,ప్రభాతవార్త:** త్రిపురలో బిజెపి వలన నష్టపోయిన భాధితులకు సహాయం చేసేందుకు ఏపి రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం విరాళాల సేకరణ చేశారు. ఈ సంధర్భంగ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.రాజశేఖర్ మాట్లాడుతు బిజెపి చేసిన దాడుల్లో ఎంతో మంది నిరాశ్రయులయ్యారని, త్రిపురలో బిజెపి పాలనను వ్యతిరేకంగాఆ మాట్లడిన వారిపై దాడులు జరుగుతున్నాయని, ఈ దాడులలో సిపియం, ప్రజా సంఘాల నాయకులు మరణించారని, మరి కొంత మంది గాయాలపాలు అయ్యారన్నారు. వారికి సహాయంగా ఆత్మకూరులో విరాళాలు సేకరించగా రూ.6,258లు వసూలు అయినట్లుగా ఆయన తెలిపారు. ఈఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు సంజీవరాయుడు, శంకర్‌రెడ్డి, రణధీర్, రామ్‌నాఆయక్, స్వాములు తదితరులు పాల్గొన్నారు.

## వీర్య ఆబోతు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

(మొదటి పేజీ తరువాయి ) :

తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్నారని కూలీలు కలెక్టర్‌కి వివరించారు. కలెక్టర్ ముఖ్యంగా అక్కడ ఉన్న మహిళ కార్మికులతో మాట్లాడుతూ మీ పిల్లలను బాగా చదివించాలని, చిన్న వయసులోనే బాల్య వివాహలు చయవద్దని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నాడు..నేడు కింద ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు తీర్చిదిద్దుతుందని మీ పిల్లలను పాఠశాలకు పంపించి వారిని బాగా చదివించి వారి యొక్క బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. అనంతరం ఉపాధి కార్మికుల కొరకు ఏర్పాటు చేసిన మెడికల్ కిట్లను పరిశీలించి, ఉపాధి కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లను అందచేశారు. మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా సెంట్రల్ నర్సరీని రాష్ట్రంలోనే ఎన్ఆర్ఈజిఎస్ కింద బాగా అభివృద్ధి చేసిన నర్సరీ అని పేర్కొన్నారు. ఈ నర్సరీలో మామిడి, సపోటా లాంటి ఉద్యాన పంటలకు సంబంధించిన మొక్కలను పెంచుతున్నారని తద్వారా జిల్లాను హార్టికల్చర్ హబ్ గా తీర్చిదిద్దేందుకు వీలవుతుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. అలాగే ఇక్కడ పెంచుతున్న మొక్కలను అటవీ శాఖ అధికారులకు, విద్యా సంస్థలకు, కార్యాలయాలకు, రైతులకు అవసరం మేరకు ఇవ్వడం జరుగుతుంన్నారు. ఈ నర్సరీ ఒక విజ్ఞాన కేంద్రంగా కూడా రైతులకు ఉపయోగపడేలా ఉందన్నారు. ఫారం పౌండ్స్ ఎలా ఏర్పాటు చేయాలి, నీటిని సమర్థవంతంగా ఎలా వాడుకోవాలి, ఏ విధమై పంటలు కలిపి పండించవచ్చు అనే విషయాలను నర్సరీ ద్వారా తెలుసుకునేలా ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం నర్సరీ నందు కలెక్టర్ మామిడి మొక్కను, ఆదోని సబ్ కలెక్టర్ టెంకాయ మొక్కను నాటారు. ఎమ్మిగనూరు మండలం బనవాసిలోని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశుసంవర్ధక పాలిటెక్నిక్ కళాశాల నందు తరగతి గదులను, ప్రయోగశాలలను, ప్రిన్సిపల్ గదిని పరిశీలించారు. అక్కడే ఉన్న పశుసంవర్ధక పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు కళాశాలకు ప్రహరీ గోడ ఏర్పాటు చేయించాలని, కళాశాల బయట బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరగా అందుకు తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. తదనంతరం పశుగణాభివృద్ధి సంస్థ అధ్వర్యంలో నిర్వహిస్తున్న ఘనీకృత వీర్య ఆబోతు కేంద్రంలోని ఎద్దులను పరిశీలించారు. వాటి నుండి వీర్యం తీసే ప్రక్రియను, తద్వారా వచ్చే తుది ఉత్పత్తి స్టోర్ యూనిట్ గురించి పశుసంవర్ధక శాఖ అధికారి కలెక్టర్‌కి వివరించారు. ఈకార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డ్వామాపీడి అమర్నాథ్ రెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా.రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేటి రాజకీయం వ్యాపారంగా మారింది

**కర్నూలు న్యూసిటి, జూన్ 21, ప్రభాతవార్త:** నగరంలోని మౌలాన అజాద్ చౌక్ బజార్‌లో ఎస్‌డిపిఐ నగర కమిటీ అధ్వర్యంలో పార్టీ 15వ అవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జెండా ఎగురవేయడం జరిగింది.కార్యక్రమంలో నగర అధ్యక్షులు అశ్వక హుస్సేన్ మాట్లాడుతూ నేటి రాజకీయం వ్యాపారంగామారిందని, పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థలకు లోబడి వారి అనుకూలంగా ప్రభుత్వాలు నడుస్తున్నాయన్నారు. ఎస్‌డిపిఐ పార్టీ అకలి నుంచి స్వేచ్ఛ భయం నుంచి స్వేచ్ఛ అనే నినాదంతో దేశంలో 12 రాష్ట్రాల్లో సంపూర్ణ నాయకత్వంతో నడుస్తుందన్నారు. అనేక చోట్ల కార్పొరేటర్లు, సర్పంచ్‌లుగా గెలిచి ముందుకు సాగుతుందన్నారు.ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా అధ్యక్షులు జహంగీర్ అహమ్మద్ మాట్లాడుతూ రాష్ట్రంలో కరెంటు బిల్లులు పెంచడం, టిడిపి, వైసీపీ పార్టీలు ఫ్రీ పథకాలు ప్రారంభిస్తామని చెప్పడం రాష్ట్రాన్ని అర్థికంగా ఇబ్బంది పెడతాయని పేర్కొన్నారు. ఎస్‌డిపిఐ పార్టీ అవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు అబ్దుల్లా, జలీలా అహ్మద్, రషీద్, హబీబ్ ఖాన్, వార్డు నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్టీలు షాపులో చోరీ

**ఆదోనిటౌన్, జూన్21, ప్రభాతవార్త ;** పట్టణంలోని మేదర్‌గేరి కొత్త ఓవర్ బ్రిడ్జి కింద బాలాజీ స్టీల్ షాపులో బుధవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఈ మేరకు షాపు యజమాని మంజునాథ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దుకాణం రేకులతో ఉండడంతో రేకును వంచి దుకాణంలో దూరి బెంచ్‌కు ఉన్న డ్రాయర్‌లో రూ.15 వేలు నగదును ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఉదయం యదావిధిగా షాపును తెరిచి చూడగా, బెంచ్ డ్రాయర్ చెల్లాచెదురుగా ఉండడంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు బాధితుడు తెలిపారు.

## చంద్రబాబు అండ్ కో తప్పుడు ప్రచారాలు మానుకోండి

### -దుష్ప్రచారాలతో వైసీపీ పార్టీకి సంబంధం లేదు

**నంద్యాల క్రైం, జూన్ 21, ప్రభాతవార్త:** చంద్రబాబు అండ్ కో తప్పుడు ప్రచారాలు మానుకోవాలని మీరే చెప్పే మాటలు రాష్ట్ర ప్రజలు నమ్మరని నంద్యాల ఎమ్మెల్సీ ఇసాక్‌బాష పేర్కొన్నారు. బుధవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర ముస్లీం మైనార్టీ అధ్యక్షులు ఖాదర్‌బాష, మున్సిపల్ చైర్మన్ మాబున్నిసాతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ గ్లోబల్ ప్రచారానికి తెరతీసి పదే పదే వల్లిస్తు ఒప్పుగా చేసే ప్రయత్నాలు అంతా ఇంత కాదని ఆరోపించారు. గుంటూరు వద్ద పొన్నూరు ప్రాంతంలో జరిగిన సంఘటన, నంద్యాల గాంధీచౌక్‌లోని మసీద్ ఇక్రా స్కూల్‌వాటిపై టిడిపి నాయకులు చేస్తున్న ప్రచారాలు ఆయన తీవ్రంగా ఖండించారు. పొన్నూరు ప్రాంతంలో వుశేన్‌బాషను వైసీపీ పార్టీకి చెందిన వారు లారీతో గుద్దిచంపారనే అభియోగాన్ని టిడిపి నాయకులు పనిగట్టుకొని తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు, దర్యాప్తు చేస్తున్నారని చెప్పారు. ఈసంఘటనలో మృతుడు, మృతికిగల కారణం సమీప బంధువులు వెల్లడించారని ఘటనలో ప్రత్యక్ష ప్రమేయం ఉన్న లారీ డ్రైవర్ షెక్ సుభానిసా పై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఇందులో వైసీపీ నాయకులకు ఎటువంటి ప్రమేయం లేదని తేల్చిచెప్పారు. గాంధీచౌక్ మసీద్ ఇక్రా ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో ఏర్పాటు చేసుకొని తప్పుడు లీజు అగ్రిమెంటు ద్వారా కొనసాగుతున్న పరిస్థితుల్లో చౌక్ మసీదుకు చెందిన ముతవల్లిలు కోర్టుకు వెళ్లారని గుర్తుచేశారు. ఈక్రమంలో కోర్టు ఉత్తర్వులు అమలు చేసేందుకు జిల్లా మైనార్టీ అధికారిపై మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి వత్తిడి తెచ్చారన్నారు. కోర్టు ఉత్తర్వులు అధికారులు అమలుచేస్తు మదరసాను కొనసాగించేందుకు ముతవల్లిలకు అప్పగించడం జరిగిందన్నారు. ఈసమావేశంలో జిల్లా మైనార్టీ అధ్యక్షులు యూసుఫ్‌బాష,పాల్గొన్నారు. అనంతరం కరపత్రాలను అవిష్కరించారు.

## ఎస్.బోయినపల్లి హైస్కూల్ విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు

### --విద్యార్థులకు ప్రశంసాపత్రాలు,నగదు పారితోషికం అందజేత..

**వెల్దుర్తి,జూన్21,ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఎస్.బోయినపల్లి జిల్లాపరిషత్ బాలుర ఉన్నతపాఠశాల విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాల పురస్కారాలు దక్కాయి.2023 ఏప్రిల్‌లో జరిగిన పదోతరగతి పరీక్షల్లో ప్రథమ స్థానం జి.ప్రవీణ్‌కుమార్(544 మార్కులు),ద్వితీయ స్థానం ఎం.మైథిలి(458 మార్కులు),తృతీయస్థానంలో జి.హర్షిత(372 మార్కులు) సాధించారు.వీరికి గ్రామ వైకాపా యువనాయకులు నర్సింగ్ అశోక్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా బుధవారం ప్రశాంసాపత్రాలు,నగదు పారితోషికంను అందించారు.ఈ సందర్భంగా విద్యార్థులను అశోక్‌కుమార్‌రెడ్డి,వారి తల్లితండ్రులు అభినందించారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎం డి.వెంకటేశ్వర్లు,ఎస్ఎంసి చైర్మెన్ శ్రీనివాసులు,ఉపాధ్యాయులు ఖాజాబేగ్,విద్యార్థుల తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## మట్కా బీటర్లు అరెస్టు

**కోడుమూరు,జూన్ 21, ప్రభాతవార్త :** కోడుమూరు పట్టణంలో బుధవారం మట్కా బీటర్లును అరెస్టు చేసినట్లు ఎస్.ఐ ఎ.పి శ్రీనివాసులు తెలిపారు.పట్టణ శివారు ప్రాంతంలో ఈడిగ వీరమోహన్,గుడిసె పద్మావతి, బోయ ఆంజినేయులు,వర్కూరు గ్రామానికి చెందిన పల్లె రవీంద్రనాథ్‌రెడ్డిలను మట్కా రాస్తూ పట్టుబడ్డారు. ఈ దాడిలో వారి వద్ద నాలుగు మట్కా చీటీలతో పాటు రూ.50000ల నగదును స్వాధీనం చేసుకున్నారు. అంతే గాక వీరు మట్కా రాయడమే గాక అక్రమ కర్ణాటక మద్యం అమ్ముతున్నట్లు ఈ దాడిలో వెల్లడైయింది. ఈ మేరకు పోలీసులు వారి వద్ద అక్రమంగా నిల్వ ఉన్న 52 కర్ణాటక మద్యం బ్యాటిల్స్‌ను కూడా స్వాదీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు ఎస్.ఐ శ్రీనివాసులు తెలిపారు.

## అకస్మికంగా ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన ఏఓ

**జూపాడుబంగ్లా,జూన్ 21,ప్రభాతవార్త:** మండల పరిధిలోని 80 బన్నూరు గ్రామం నందు ఎరువులు మరియు పురుగుల మందుల దుకాణాలను మండల వ్యవసాయశాఖ అధికారి బి.క్రిష్ణారెడ్డి బుధవారం అకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. స్టాక్ వివరాలు, లైసెన్స్‌లు, ఇన్వాయిస్ పత్రాలను పరిశీలించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతు నిభంధనలకు అనుగుణంగా నాణ్యమైన ఎరువులు, విత్తనాలు మాత్రమే విక్రయించాలని తెలిపారు. అలాగే రైతు భరోసా కేంద్రాలలో రైతులకు అవసరమైన ఎరువులు మరియు విత్తనాలు అందుబాటులో ఉంచడం జరిగిందని, కౌలు రైతులు కౌలు కార్డు తీస్కోని లబ్ది పొంద వచ్చునని ఏఓ తెలిపారు.

## నిషేధిత పురుగు మందుల అమ్మకాలు నిలుపుదల - ఏవో

**అవుకు,జూన్21,ప్రభాతవార్త:** అవుకు మండల వ్యవసాయాధికారి వి.అబ్దుల్‌హక్ బుధవారం పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మండలంలోని బచ్చు వెంకటసుబ్బయ్య మరియు శ్రీనివాస ఏజెన్సీ దుకాణాలను రెవెన్యూ మరియు పోలీస్ సిబ్బందితో కలిసి తనిఖీ నిర్వహించారు.ఈ తనిఖీల్లో భాగంగా బచ్చు వెంకటసుబ్బయ్య దుకాణం నందు అనుమతిలేని పురుగు మందుల అమ్మకాలను నిలుపుదల చేయడం జరిగింది.వీటి విలువ సుమారు రూ.59వేలు ఉంటుందని అలాగే స్టాక్ రిజిస్టర్,స్టాక్ బోర్డు,బిల్లు బుక్‌లు మరియు ఇతర వ్యాపార లావాదేవీలకు సంబంధించిన రశీదులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని వ్యాపారులను హెచ్చరించడం జరిగింది.వ్యవసాయ,రెవెన్యూ మరియు పోలీస్‌శాఖకు సంబంధించిన టీమ్‌ను టాస్క్‌ఫోర్స్‌గా ఏర్పడి ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని ఏవో తెలియజేశారు.ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని కావునా డీలర్లు ఎరువులనుకాని,పురుగు మందులనుకాని ఎమ్మార్పీ ధర కంటే అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.ఈ తనిఖీల్లో ఆర్ఐ వెంగళరెడ్డి,ఏఎస్ఐ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## భాదిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**ఆదోని రూరల్,జూన్ 21,ప్రభాతవార్త :** మండల పరిధిలోని కపటి గ్రామంలో మాదిగ మోజెస్ గుడిసె సోమవారం అగ్ని ప్రమాదానికి గురై పూర్తిగా కాలిపోయింది. ఈ విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్,మాజీ శాసనసభ్యులు కె మీనాక్షినాయుడు భాదిత కుటుంబానికి అండగా నిలవాలనుకున్నాడు. అందులో భాగంగా మీనాక్షినాయుడు ఆదేశాల మేరకు తెదేపా యువ నాయకులు మారుతి నాయుడు బుధవారం రూ.10వేలు ఆర్థిక సహాయం భాదిత కుటుంబానికి అందచేశారు.

## చింతకుంట.. నీటిచింత..!

(మొదటి పేజీ తరువాయి ) :

పూడిక తీయించాలని పలుమార్లు జిల్లా,మండల అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆ గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. తాగునీటి కోసం అవస్థలు పడుతున్నా సంబంధిత ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు. కర్ణాటకకు వెళ్లి ఒక బిందె నీరు రూ.25లు పెట్టి కొంటున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మల్లికార్జున పల్లి,మేదెహాల్,కామినహాల్,చింతకుంట గ్రామాల్లో డబ్బులు పెట్టి మినరల్ వాటర్ కొనలేక గ్రామ చివరలో ఉండే గుంతలో వర్షపునీటిని తెచ్చుకుని తాగుతున్నామని వాపోతున్నారు. గుంతలో నీరు తాగి అనారోగ్యాలకు గురవుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## యోగా నిరంతర అభ్యాసం

(మొదటి పేజీ తరువాయి ) :

మనము పరాయిపాలనలో అన్ని కోల్పోయామని గతంలో మానవ జీవితకాలం 100 సంవత్సరాలు ఉండేదని ప్రస్తుతం మన భారతదేశంలో మానవ జీవన కాలం దాదాపు 70 సంవత్సరాలు మాత్రమే అంటే మన భారత దేశంలో యోగాను తగ్గించాం ప్రపంచంలో దాదాపుగా 192 దేశాల్లో యోగాను ఆచరిస్తున్నారు అదేవిధంగా మనదేశంలో మరల యోగా ను ఆచరించి మానవాళి సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ యోగా సంఘం సభ్యులు శ్రీధర్ రెడ్డి,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి, జెడ్పి సీఈఓ నాసర రెడ్డి,జిల్లా ఆయుష్ ఆఫీసర్ చంద్రశేఖర్ రెడ్డి, సెట్కూర్ సిఇఓ రమణ, డిఎం అండ్ హెచ్ఓ రామ గిడ్డయ్య,ఎన్సిసి గ్రూప్ కమాండర్ కర్నల్ రమేష్, ఎస్ బి 28 ఎన్సిసి గ్రూప్ కమాండింగ్ ఆఫీసర్ కర్నల్ అక్షయ మథుర్. ఏపీ ఎస్పీ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్2 మహబూబ్ బాషా, ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి ప్రభాకర్ రెడ్డి, యునాని సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కే శ్రీనివాస్, యోగ మరియు నాచురోపతి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె వి కె ప్రసాద్,యోగా గురువు శ్రీమతి బిటి జయలక్ష్మి, సిల్వర్ జూబ్లీ కాలేజ్, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల,జిల్లా అధికారులు, వివిధ పాఠశాల, కళాశాలల విద్యార్థిని విద్యార్థులు, ఎన్సిసి, తదితరలు పాల్గొన్నారు

## నిత్యయోగ సాధన
# ఆరోగ్యప్రదాయం

**-భారతీయ కళలకు యోగ అత్యధిక ప్రాధాన్యత**
**-ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ అర్చన**



**నంద్యాల విద్య, జూన్ 21, ప్రభాతవార్తః** భారతీయ కళలకు యోగ క్రీడలు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని యోగ పట్ల మనదేశంలోనే కాకుండా ప్రపంచంలో ఎంతో అవగాహన చైతన్యం కలిగి ఉన్నారని యోగ సాధన వ్యక్తులకు ఆరోగ్యప్రదాయమని నంద్యాల జూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ అర్చన పేర్కొన్నారు. యోగ డే సందర్భంగా పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ, పిజి కళాశాలల్లో కళాశాలల చైర్మన్ డా.రామకృష్ణారెడ్డి అధ్యక్షతన 9వ అంతర్జాతీయ యోగా డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర ్భంగా వారు మాట్లాడుతూ విద్యారు ్థలు చిన్న వయసు నుంచే యోగా సాధన చేయాలని తెల్లవారుజామునే లేచే అలవాటు చేసుకోవాలన్నారు. ఏ పని అయినా ఏకాగ్రతతో చేస్తే ఆరోగ్యం పొందడమే కాకుండా జీవితంలో ఉన్నత స్థానానికి రావడం జరుగుతుందన్నారు. క్రమశిక్షణతో యోగా సాధన చేయాలన్నారు. సత్యసాయి ధ్యానమండలి సభ్యులు ప్రసాద్ విద్యార్థులచే యోగ చేయించారు. ఇంటిదగ్గర సూర్య నమస్కారాలతో పాటు ఇతర అసనాలు అన్ని కలిపి ఒక గంటసేపు అభ ్యసన చేయాలన్నారు. దీని వల్ల శరీరానికి, మెదడుకు ఐక్యత సాధించి విద్యార్థులు విజయం వైపు పయనిస్తారన్నారు. ఈ యోగా కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎస్పీవైరెడ్డి, ఎస్‌డిఆర్, ఆర్జీఎం, నంద్యాల పబ్లిక్ స్కూల్, రామకృష్ణ కళాశాల విద్యారు ్థలు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్బయ్య, ఎన్‌సిసి అఫీసర్ కెప్టెన్ లలితా సరస్వతీ, ఎన్‌సిసి సిబ్బంది సుబేదార్ వినోద్ మింజ్, హవల్దార్ గంగాధర్, రమణమ్మ, రూతు, శంకర్, పెద్దస్వామి, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, కృష్ణ, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న కాలనీని తనిఖీ చేసిన హౌసింగ్ పీడి



**వెలుగోడు, జూన్ 21, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో జరుగుతున్న నిరా ్మణాలను నంద్యాల జిల్లా పీడి విజయబాస్కర్, డిఈఈ అకస్మిక తనిఖీలు చేశారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో పీడి మాట్లాడుతు ప్రస్తుతం ప్రభుత్వం అంధిస్తున్న అడ్వాన్స్ పేమెంట్‌ను అందరికి వచ్చే విధంగా చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని బీమ్ స్టేజ్ 75, బేస్‌మెంట్ లెవెల్ 244, లెంటల్ లెవెల్ 177, రూఫ్ లెవెల్ 56 ఇల్లు ఉన్నాయని, వీరందరికి అడ్వాన్స్ పేమెంట్ కింద రూ.10వేలు నుంచి రూ.20వేల వరకు ఇవ్వ వచ్చునని సూచించారు. అదే విధంగ జూలై నెలలలో 107 ఇళ్ళు పూరి ్త చేయాలని సిబ్బందికి టార్గెట్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం.పి.డి.ఓ. డీటి, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

## కుల మతాలకు అతీతంగా పండుగలను జరుపుకోండి

**- కర్నూలు డిఎస్పీ విజయశేఖర్**



**కోడుమూరు, జూన్ 21, ప్రభాతవార్త :** కుల మతాలకు అతీతంగా పండుగలను జరుపుకోవాలని కర్నూలు డిఎస్పీ విజయశేఖర్ అన్నారు. బుధవారం ఆయన గూడూరు పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 29వ తేదిన జరిగే బక్రీద్ పండుగను ముస్లీంలు ప్రశాంతంగా జరుపుకోవాలని అన్నారు. గ్రామంలో అన్ని వర్గాల వారు ప్రశాంతంగా ఉండాలని, అప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. హింసలకు ప్రేరేపిస్తే పోలీసు శాఖ పరంగా ఖఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు సిఐ శ్రీధర్, గూడూరు ఎస్.ఐ పవన్‌కుమార్‌లు పాల్గొన్నారు.

**డిఎస్పీకి సన్మానం :** మొదటి సారిగా గూడూరుకు వచ్చిన కర్నూలు డిఎస్పీ విజయశేఖర్‌ను గూడూరు నగర పంచాయతీ వైస్ చైర్మన్ అస్లాం, రెండవ చైర్మన్ లక్ష్మన్న, మునగాల సర్పంచ్ రామాంజినేయులు, కౌన్సిలర్ మద్దిలేటి, వైకాపా నాయకులు ఖలీల్, శ్రీనులు శాలువ కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

## నకిలీ విత్తనాలు అమ్మేవారిని ఉరితీయాలి

**:- ఆదోని జిల్లా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు నూర్ అహ్మద్**

**ఆదోని రూరల్, జూన్ 21, ప్రభాతవార్త :** నకిలీ విత్తనాలు అమ్మేవారిని ఉరితీయాలని ఆదోని జిల్లా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు నూర్ అహ్మద్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నేడు నకిలీ విత్తనాల వల్ల రైతులు నష్టపోవటం పరిపాటిగా మారిపోయిందన్నారు. నష్టపోయిన కొందరు రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు ప్రజల గుండెలను పిండేస్తున్నాయన్నారు. కానీ ఇదేదో చిన్నపాటి మోసమే అన్నట్లు అధికారులు చిన్న చిన్న కేసులు పెట్టి చేతులు దులుపుకోవడం మరింత విస్మయం కలిగించే విషయమన్నారు. కావున అన్నదాతలకు సంపూర్ణ రక్షణ కల్పిస్తూ కొన్ని కఠిన చట్టాలను తయారు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదోని జిల్లా సమితి తరుపున డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి రూరల్ నాయకులు పివి కుబేరస్వామి పాల్గొన్నారు.

# ఉపాధి పథకం ద్వారానే వలస నివారణ సాధ్యం - కలెక్టర్



**గోనెగండ్ల జూన్ 21 ప్రభాతవార్త :** ఉపాధి పథకం పనుల ద్వారానే గ్రామాల్లో వలస నివారణ సాధ్యం అవుతుందని ప్రతి ఒక్క కూలీ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సృజన కోరారు. బుధవారం మండల కేంద్రమైన గోనెగండ్లలో జరుగుతున్న ఉపాధి పనులను ఆమె పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు ఎన్ని గంటలకు ఉదయం ఉపాధి పనులకు హాజరవుతున్నారు. మళ్లీ ఎన్ని గంటలకు ఇంటికి వెలుతున్నారని ఉపాధి కూలీలను అడిగారు. మహిళా ఉపాధి కూలీలు ఉదయం ఆరు గంటలకు హాజరై పదకొండు గంటలకు ఇండ్లకు వెలుతున్నామని తెలిపారు. ఎండవేడిమిలో వడదెబ్బ, ఇతర దెబ్బలు తాగిలితే ఏ మందులు వాడుతున్నారని, ప్రథమ చికిత్స కిట్‌లను పరిశీలించారు. ప్రతి రోజు ఉపాధి సిబ్బంది తాగునీరు, మజ్జిగ ప్యాకెట్‌లు అందిస్తున్నారా లేదా అని కూలీలను అడిగి తెలుసుకున్నారు. కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ కొలతల ప్రకారం పనులు చేస్తే పూర్తి స్థాయిలో కూలీ డబ్బులు అందుతాయన్నారు. మీ అడబిడ్డలను చదివిస్తున్నారా లేదా అని కూలీలను అడిగారు చదువుకునే అడబిడ్డలకు మరింత చదివించండి త్వందరపడి బాల్యవివాహాలు చేయకండి వారి విద్యనే వారి భవిష్యత్‌అని తెలిపారు. ప్రభుత్వం నాడు-నేడు పథకం కింద గ్రామాలలో పాఠశాలలు మెరుగుపడ్డాయని మీ పిల్లలను పాఠశాలలకు పంపి వారి భవిష్యత్‌కు బంగారు బాట వేయాలని కోరారు. అనంతరం పంటపొలంలో నిర్మించిన నీటి ట్యాంక్ తొట్టిని పరిశీలించారు. కొత్తిమీర సాగు చేసి పొలంను పరిశీలించారు. గోనెగండ్ల మండలంలో కొత్తి మీర పంటను సాగు చేస్తారా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరికి జగనన్న గృహాలు మంజూరయ్యారు. అని కూలీలను అడిగారు అందుకు కూలీలు అర్హులైన వారికి కాకుండా అనర్హులను ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి పథకం పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, ఏపీడీ ఆల్లిపిర, తహశీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో నాగేష్, ఏపీవో మహమ్మద్ భాషా, ఇసి ఉస్మాన్‌భాషా, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాలో వైద్యులు విధుల పట్ల నిర్లక్ష్యం వీడాలి

**-గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన అధునిక వైద్యసేవలు -జిల్లా కలెక్టరు**



**నంద్యాల, జూన్ 21, ప్రభాతవార్త ప్రతినిధిః** జిల్లాలోని వైద్యులు విధుల పట్ల నిర్లక్ష్యం వహించి రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యాధికారులను జిల్లా కలెక్టరు డా.మనజీర్ జిలాని సమూన్ అదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని విసి కాన్ఫరెన్స్ ద్వారా ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా.రాగిరి వెంకటరమణ అధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ అయుష్‌మాన్ భారత్ ఆరోగ్య గుర్తింపుకార్డు ల ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. వెలుగోడు, ఆత్మకూరు పట్టణాల్లో కొత్తగా నిర్మించిన ఆసుపత్రుల్లో విద్యుదీకరణ పనులు వేగవంతం చేయాలని డిసిహెచ్ఎస్ జ్రప్రుల్లాను కలెక్టరు అదేశించారు. డాక్టర్లు ముఖ అధారిత హాజరు తప్పనిసరిగా వేస్తు రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. రక్తహీనతతో బాధపడుతున్న పిల్లలకు, గర్భిణిలకు ఐరన్ పోలిక్ ట్యాబ్లెట్లు ఇవ్వడంతోపాటు విటమిన్ ఎ ద్రావకాన్ని క్రమం తప్పకుండా వేయాలన్నారు. సామాజిక ఆరోగ్యకేంద్రాల్లో ఇన్‌పెషెంట్ల సంఖ్యను పెంచాలని ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, గ్రామాల్లో పర్యటించి గర్భిణి స్త్రీల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సమావేశంలో వివిధ ప్రాంతాల వైద్యులు పాల్గొన్నారు.

## పీజీటీ లాంగ్వేజెస్ వారిని తొలగించే యత్నం మానుకోవాలి....

**- కలెక్టరేట్‌ను ముట్టడించిన పీజీటీ ఉద్యోగులు**
**- నాలుగు సంవత్సరాలుగా కేజీబీవీ పార్ట్ టైం పీజీలుగా పనిచేస్తున్న వారి సర్వీను కాంట్రాక్టుగా క్రమబద్ధీకరించాలి**



**కర్నూలు కలెక్టరేట్, జూన్21, ప్రభాతవార్త ;** నాలుగు సంవత్సరాలుగా కేజీబీవీలో పార్ట్ టైం పీజీటీలుగా ఉన్న తమ సర్వీసును కాంట్రాక్టుగా క్రమబద్ధీకరించాలని పీజీటీ ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కర్నూలు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా పీజీటీలుగా పనిచేస్తున్న వారికి ముందుగా రిక్వెస్ట్ ట్రాన ్స ఫర్ చేసి ఆ తదుపరి కొత్త వారిని నియమించాలన్నారు. 2019 జూన్‌లో ఆర్‌సీ నం.1144/ఏపీఎస్ఎస్ఏ/కేజీబీవీ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా కేజీబీవీల్లో పార్ట్ టైం పీజీటీలుగా రూ.12 వేలు జీతానికి అపాయింట్ అయిన వారు ఫుల్‌టైం వర్క్ చేసి (స్టడీ హావర్స్, నైట్ డ్యూటీలు, రెమిడియల్ క్లాసెస్) ఇంటర్మీడియెట్ విద్య భారాన్నంతా సమర్థవంతంగా మోసి ఉత్తమ ఫలితాలు వచ్చేందుకు కృషి చేశామన్నారు. కొన్ని కేజీబీవీలు జనవాస ప్రాంతాలకు దూరంగా ఉన్నాయని, పరిసర ప్రాంతాలోల రెంటెడ్ హౌస్ దొరకకపోయినా తమతమ స్వస్థలాల నుంచి అప్ అండ్ డౌన్ చేసి ఉద్యోగం చేయడం జరిగిందన్నారు. స్వీపర్లు, అటెండర్స్ సైతం రూ.20 వేలు, ఎంటీఎస్ జీతం తీసుకుంటున్నా ఏమాత్రం ఆత్మన్యూనతకు లోనవ్వకుండా ఏదో ఒక రోజు జీతం పెరగుతుందన్న ఆశతో రూ.12 వేలకే పనిచేశామన్నారు. ప్రభుత్వం కేజీబీవీలోని అందరూ స్టాఫ్‌తో పాటు పార్ట్ టైం పీజీటీలను కూడా కరుణించి జీతం రూ.26,759 పెంచుతూ 15-3-2023న విడుదల చేసిన మెమోలో పీజీటీలకు కూడా రిక్వెస్ట్ ట్రాన్సఫర్‌కు అవకాశం ఇచ్చిందన్నరు. 27-5-2023న కేజీబీవీ టీచింగ్ స్టాఫ్ నోటిఫికేషన్ రాగా వాటిని భర్తీ చేసేలోగానే కొత్తగా నోటిఫై చేసి రిక్రూట్‌మెంట్ చేయబోయే పీజీటీల ప్లేసులకు రిక్వెస్ట్ ట్రాన్సఫర్స్ జరుగుతాయని ఆశించిన పీజీటీలకు నిరాశే మిగిలిందన్నారు. ఇప్పటికైనా తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వారు కోరారు. లేనిపక్షంలో ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు.

## రాష్ట్రంలో చంద్రబాబుతోనే అభివృద్ధి : టీజీ భరత్



**కర్నూలు న్యూసిటీ, జూన్ 21, ప్రభాతవార్త:** వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు గెలువకపోతే రాష్ట్రంలో అభివృద్ధి ఉండదని కర్నూలు నియోజకవర ్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జీ టీజి భరత్ అన్నారు. నగరంలోని 11వ వార్డులోని ఖడక్ పుర, కనికంటి వీధిలో ఆయన భవిష్యత్తుకు భరోసా పేరుతో ఇంటింటికి తిరిగి ప్రజలను కలిశారు. వచ్చే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే కర్నూలు అభివృద్ధి చేస్తానని యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని హామి ఇచ్చా రు. టిడిపి గెలిస్తే ఏవిధంగా అభివృద్ధి సంక్షేమం ఉంటుందో ఇంటింటికి తిరిగి వివరించారు. అనంతరం టిజి భరత్ మాట్లాడుతూ ప్రజల భవిష్యత్తు బాగుండాలంటే రాష్ట్రంలో చంద్రబాబు రావాలని, కర్నూలులో తాను ఎమ్మెల్యేగా గెలువాల్సిన అవసరం ఉందన్నారు. తన తండ్రి కర్నూలును ఎంతో అభివృద్ధి చేశారని తాను అంతకంటే ఎక్కువ అభివృద్ధి చేస్తానని హామి ఇచ్చా రు. కర్నూలు అభివృద్ధి కావాలంటే తనను గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. తమ టీజివి సంస్థల అధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని టీజి భరత్ అన్నారు. వీటికి సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందించి వైద్యపరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మెహబూబ్‌ఖాన్, బషీర్, నౌషాద్, ఈశ్వర్, సలీం, ఫర్జానా, సభ, అదీబ్, రసూల్ సద్దాం, అనంతయ్య, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

## 9 బాక్సులు అక్రమ మద్యం పట్టివేత..రెండు స్కూటర్లు సీజ్



**ఎమ్మిగనూరు , జూన్ 21 ప్రభాతవార్త:** ఎమ్మిగనూరు పట్టణంలో స్థానిక సెబ్ స్టేషన్ పరిధిలోని కర్నూలు జిల్లా జాయింట్ డైరెక్టర్, స్పెషల్ ఎనో ఫ్ర్స్‌మెంట్ బ్యూరో కృష్ణకాంత్ పటేల్ ఆదేశాల మేరకు సెబ్ సిఐ జయరాం నాయుడు, డిటిఎఫ్ కర్నూలు వారితో కలసి మంత్రాలయం మండలం, మాధవరం తండా క్రాస్ రోడ్డు నందు వాహనాలు తనిఖీలు చెయ్యగా రెండు ద్విచక్ర వాహనాలపై ముగ్గురు ముద్దాయిలు కర్ణాటక మద్యం బాక్సులు తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించి వారిని అరెస్ట్ చేసి అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు బుధవారం తెలిపారు. 9 బాక్సుల నందు 90ఎంఎల్ కు సంబంధించి దాదాపు 864 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని ఎమ్మిగనూరు కోసిగి మండలం చిన్న భూంపల్లి గ్రామానికి చెందిన మాధవరం నరసింహులు, కోలిమి గోవిందు, కోసిగి గ్రామానికి చెందిన తలారి గోవిందులను అరెస్ట్ చేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా అక్రమ మద్యం రవాణ చేస్తున్న రెండు స్కూటర్‌లను సీజ్ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా రెండు ద్విచక్ర వాహనాలను కూడ సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఇన్స్పెక్టర్ రాజశేఖర్ గౌడ్, ఎస్ఐ సోమశేఖర్ రావు, హెడ్‌కానిస్టేబుల్ స్వామినాథన్, లింగ ప్రసాద్, రబ్బాని, గోపాల్, చంద్రమౌళి, నరసింహరెడ్డి, కరుణాకర్, రాధమ్మ, రామచంద్రుడు పాల్గొన్నారు

## గ్రామాల్లో అందరూ కలిసి మెలిసి జీవించాలి : డిఎస్‌పి సీతారామయ్య



**సూగూరు(మంత్రాలయం), జూన్ 21, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల్లో ఉండే ప్రజలు అందరూ కలిసి మెలిసి జీవించాలని డిఎస్‌పి సీతారామయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని సూగూరు గ్రామ ప్రజలకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరు కూడా గొడవలకు వెళ్ళకూడదన్నారు. సమాజంలో అన్ని కులాలు సమానమే అన్నారు. అసాంఘిక కార్యక్రమాలైన మద్యం, మట్కా, పేకాట, అక్రమంగా ఇసుక, బియ్యం రవాణాకు పాల్పడితే సహించేది లేదన్నారు. కాబట్టి గ్రామంలో అందరూ కలిసి ఉన్నప్పుడే గ్రామం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈకార్యక్రమంలో సిఐ శ్రీనివాసులు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పిఎం కిసాన్‌కు ఈకెవైసి తప్పనిసరి



**ఆదోని రూరల్, జూన్ 21, ప్రభాతవార్త :** రైతులకు కేంద్రప్రభుత్వం విడుదల చేసే 14వ విడత పిఎం కిసాన్ పడాలంటే ఈకెవైసి తప్పనిసరి అని ఏడిఏ గిరీష్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈకెవైసి చేసుకుంటేనే పిఎం కిసాన్ పడుతుందన్నారు. ఈ నెల 28వ తేదీ వరకు ఈకెవైసి అవకాశం ఉందన్నారు. అలాగే కౌలురైతులు కౌలురైతు కార్డులను దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆదోని డివిజన్‌లో ఇప్పటివరకు ఆదోనిలో 1200, కౌతాళంలో 600, కోసిగిలో 200, పెద్దకడుబూరులో 400 కౌలురైతు కార్డులను మంజూరు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా రైతులు పంట మార్పిడి చేయాలని అలాగే రాగులు, కొర్రలు సాగుచేయాలన్నారు. ఈ సమావేశంలో ఏఓ అశోక్‌కుమార్‌రెడ్డి వున్నారు.

## ఎట్టకేలకు సిఎస్ఐ లండన్ మిషన్ భవనంపై తొలగిన వివాదం

**ఆలూరు, జూన్ 21, ప్రభాతవార్త :** మండల పరిధిలోని మొలగవల్లి కొట్టాల గ్రామంలో ఉన్న సిఎస్ఐ లండన్ మిషన్ భవనంపై వివాదం తొలగింది. ఈ సందర్భంగా బుధవారం మొలగవల్లి కొట్టాల సచివాలయ-3వ కన్వీనర్ పత్తికొండ ప్రసాద్ మాట్లాడుతూ 179ఎలో ఆన్‌లైన్ అడంగల్, ఆర్ఓఆర్ ఉన్నాయని ఈ భవనాన్ని కొందరు ఆక్రమించింది నిజమేనన్నారు. లండన్ మిషనరి సిఎస్ఐకి సంబంధం ఉందని అధికారులు తెలిపారన్నారు. ఎవ్వరు కూడా గొడవలకు పోకుండ అందరు కలిసికట్టుగా గ్రామంలో అందరికి ఉపయోగపడే విధంగా ఆ బంగ్లాను నియమించాలని ఆలూరు వైకాపా ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి సూచించారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఐ సంఘం పెద్దలు దేవిపుత్ర, బుజ్జి, సురేష్‌బాబు, ఆంజనేయ, ప్రభుదాసు, ఆనందు, సత్యానందం, మల్లేష్, దేవదాసు, అరుణ్, భీమప్ప తదితరులు పాల్గొన్నారు.

## యోగా ద్వారా మానసిక, శారీరక రుగ్మతలన్ని తొలగిపోతాయి

**- ఎంపీ డా.సంజీవ్‌కుమార్**




**కల్లూరు, జూన్ 21, ప్రభాతవార్తః** 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ ఆయుష్ విభాగంలో జరిగిన యోగా కార్యక్రమంలో పాల్గొన్న కర్నూలు పార్లమెంటు సభ్యులు డా.సంజీవ్‌కుమార్ పాల్గొనా ్నరు. ఈసందర్భంగా యావత్తు మానవాళికి విశ్వగురువు నా భారత దేశం అని యోగా ద్వారా మానసిక, శారీరక రుగ్మతలన్ని తొలగిపోతాయన్నారు. కరోనా లాంటి మహమ్మారితో పోరాడాలంటే కూడ ప్రతిఒక్కరు వారి జీవన ప్రయాణంలో ఒక భాగంగా యోగా ధ్యాన ప్రక్రియ కొనసాగించాలన్నారు. విద్యార్థిని, విద్యార్థులు చిన్న వయస్సు నుంచే అలవాటు చేసుకొని ఆరోగ్యం, మరియు ఆనందంతో జీవించాలని ఎంపీ పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో కమిషనరు భార్గవ్ తేజ, విద్యార్థులు, వైద్య ఆరోగ్యశాఖ క్రీడా సిబ్బంది, అధికారులు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## భార్యను చంపిన కేసులో భర్తకు జీవిత ఖైదు



**ఆదోనిలీగల్, జూన్21, ప్రభాతవార్త ;** భార్యను హత్య చేసిన కేసులో భర్తకు ఆదోని రెండవ అదనపు జిల్లా కోర్టు జడ్జి పి.జె.సుధ జీవితఖైదు (యావజ్జీవ కారాగార శిక్ష) విధిస్తూ తీర్పునిచ్చినట్లు చిప్పగిరి ఎస్ఐ మల్లికార్జున విలేకరులకు తెలిపారు. చిప్పగిరి మండలం దేగులపాడు గ్రామానికి చెందిన దయ్యాల వెంకటస్వామి అలియాస్ వెంకటేష్ అనే వ్యక్తి 3-6-2023వ తేదిన తెల్లవారుజామున మద్యం మత్తులో రోకలిబండతో భార్య హైమావతి(32)ని కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందింది. హైమావతి తండ్రి లాలప్ప అలియాస్ లాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు చిప్పగిరి పోలీసులు కేసు నమోదు చేసుకొని కోర్టుకు వేశారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం, కాగా హతుడు భార్యను చంపిన కేసులో పెద్ద కుమార్తె అక్షిత, కుమారుడు భరత్ సాక్షులుగా ఉన్నారు. ఆదోని రెండవ అదనపు జిల్లా కోర్టు జడ్జి పి.జె.సుధ విచారణ చేపట్టగా మృతురాలి పెద్ద కుమార్తె, కుమారుడు సాక్ష్యం చెప్పగా కేసు పూర్వాపరాలను పరిశీలించారు. హత్యకు కారకుడైన దయ్యాల వెంకటేష్‌కు యావజ్జీవకారాగార శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధించినట్లు చెప్పారు. జరిమానా కట్టని పక్షంలో మరో ఆరు నెలల జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందన్నారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మోతిలాల్ వ్యవహరించారని ఎస్ఐ విలేకరులకు తెలియజేశారు.

## ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



**నందవరం, జూన్ 21, ప్రభాతవార్త:** ప్రజాసంక్షేమమే ప్రభుత్వం యొక్క ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని అందులో భాగంగానే నవరత్నాలను ప్రవేశపెట్టి అర్హులైన ప్రజలందరికి సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కిందని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే తనయుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని బాపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మండల వైసీపీ కన్వీనర్ శివారెడ్డి గౌడ్, కనకవీడు సీనియర్ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, వీరుపాక్షిరెడ్డి, గ్రామ వైసీపీ నాయకుల అధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర ్భంగా గ్రామంలో గ్రామ ప్రజలు ఆహ్వానిస్తు బ్రహ్మరథం పట్టారు. దీనిలో భాగంగా గ్రామంలో ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కులం, మతం, రాజకీయం, వర్గం చూడకుండా అర్హతనే ప్రామాణికంగా తీసకొని సంక్షేమ పథకాలు నేరుగా లబ్దిదారులకే ఎటువంటి అవినీతి లేకుండా అందజేసిన ఘనత మన ముఖ్యమంత్రికే దక్కిందని దొరబాబు తెలిపారు. స్థానిక ప్రజలు తెలిపిన సమస్యలను అప్పటికప్పుడు పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులను అదేశించారు. ఈకార్యక్రమంలో గ్రామ నాయకులు నరహరిరెడ్డి, రాముడు, తిమ్మప్ప, కోతి ఈరన్న, నరసరాజు, ఎంపీడిఓ, డిటి, తహశీల్దార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అధునిక జీవనశైలీ యోగాతో రోగాలు మాయం




**నంద్యాల, జూన్ 21, ప్రభాతవార్తః** మనసును శరీరంల మధ్య సమయంను కలుగజేయడమే కాక యోగ అధునిక జీవనశైలి విధానంలో నూతన మార్పును సంతరిస్తుందని యోగా ధ్యానంతో దీర్ఘకాలిక రోగాలు నయం అవుతాయని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల డాక్టరు జి యశోధర పేర్కొన్నారు. యోగా డే సందర ్భంగా బుధవారం ప్రత్యేక కార్యక్రమాన్ని యోగ చైతన్య కేంద్రం నందు నిర్వహించారు. అసిస్టెంటు మున్సిపల్ కమిషనరు వెంకటదాసు, నంద్యాల మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా.స్వర్ణలత, వైస్ ప్రిన్సిపాల్ డా.ఆనంద్‌కుమార్, డిసిహెచ్ఎస్ డా.జఃప్రుల్లా, జిల్లా క్రీడల అధికారి ఎంఎన్‌వి రాజు, యూనాని వైద్యులు డా.షమిమున్నిసా, అయుష్ అసోసియేట్ కార్యదర్శి పరమేశ్వర్‌రెడ్డిలు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సూచించే మార్గదర్శకాలను పాటిస్తు యోగ క్రమం తప్పకుండా చేయడం వల్ల శారీరక, మానసిక, సామార్థ్యం పెరుగుతుందన్నారు. దీని వల్ల శరీరంలో వ్యాధినిరోధక శక్తి పెరిగి వ్యాధులు రాకుండా ఉంటాయన్నారు. వ్యాధుల నుంచి బయట పడడానికి ఈయోగ సహాయపడుతుందన్నారు. అధునిక జీవనశైలీ విధానంలో ప్రతిఒక్కరు కూర్చొని చేసే పనులు అధికంగా ఉండడం వల్ల నడుంనొప్పి, మెడనొప్పి, దీర్ఘకాలిక వ్యాధులు రావడం జరుగుతుందన్నారు. నిరంతరం యోగ చేయడం వల్ల ఈవ్యాధుల నుంచి ఉపశమనం పొందడంతోపాటు శారీరక, మానసిక ఒత్తిడి నుంచి బయటపడి సమతుల్యమైన జీవన విధానాన్ని అమలుచేసుకోవచ్చన్నారు. యోగా కార్యక్రమంలో డా.రహిమాన్, డా.మార్టిన్, డా.భాగ్యలక్ష్మీ, భవనాశి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ డా.జి లక్ష్మీదేవి, మాఘం వెంకటేశ్వర్లు, యోగ టీచర్లు జగన్‌మోహన్‌రెడ్డి, నాగేంద్ర, ప్రసాద్, అయూష్ విభాగ వైద్యులు, ప్రజలు పాల్గొన్నారు.